# నాలోని నాదాలు

- నల్లపనేని విజయలక్ష్మి

భాషాసాహిత్యాలు నిరంతర పరిణామ శీలమైనవి. ఆ పరిణామం ఒక దశలో గుర్తించదగినంతగా ఉండకపోవచ్చు. ఒకానొక దశలో స్ఫుటంగా కనిపించవచ్చు. 19-20 శతాబ్దాలలో తెలుగు భాషా సాహిత్యాలకు సంబంధించి విప్లవాత్మక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎన్నో నూతన ప్రక్రియలు తెలుగు సాహిత్యానికి నూతన సొబగులు అద్దాయి. కవిత్వ వస్తువులో మార్పు, రచనా విధానంలో ప్రయోగాలు అనివార్యమయ్యాయి. తెలుగు కవిత్వం ఛందోబంధనాలను వదిలించుకొని స్వేఛ్ఛా వ్యక్తీకరణవైపు పరుగులు తీసింది. గురజాడ ఛందోబంధనాలను సడలిస్తే, శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణ బాబు, పట్టాభి, పురిపండా, ఆరుద్ర, గంగినేని, అజంతా, తిలక్, ఆనిసెట్టి మొదలైనవారు ఆ బంధనాలను పూర్తిస్థాయిలో త్రెంచివేసే ప్రయత్నం చేశారు. వచన కవితా మార్గాన్ని ముందుకు తీసుకువెళ్లారు. తెలుగులో వచన కవితా పరిణామ దశగా 1940-50 మధ్యకాలం కనిపిస్తుంది. వచన కవితా మార్గం విశిష్టతను గుర్తించి, దానితో మమేకమై, ఉద్యమస్ఫూర్తితో దానిని ప్రచారం చేసినవాడు కుందుర్తి.

కుందుర్తి 1967లో రచించిన 'నాలోని నాదాలు' పూర్తిగా ఆత్మాశ్రయమైన రచన. 34 కవితా ఖండాలతో కూడినది. ఇందులో ఆయన జీవితాన్ని గురించి, కవిత్వాన్ని గురించి, కాలాన్ని గురించి, ఇతర విషయాలను గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆత్మాశ్రయ కవితారీతి ప్రధానంగా భావకవితా యుగానికి చెందినది. అభ్యుదయ కవులు కూడా ఆత్మాశ్రయ రీతిలో రచనలు చేయటం అక్కడక్కడా కనిపిస్తుంది. అయితే అభ్యుదయ కవుల స్వీయ భావాలు సామాజిక స్పృహతో కూడినవి. కుందుర్తి హృదయ విపంచి నుండి వెలువడిన నాదాలు ఆయన అభ్యుదయ భావతరంగాలను మనకు వినిపిస్తాయి. 'గ్రంథాలలో బంధించింది కాక / నాల్కల మీద నర్తించే భాషలో' వ్రాయటంపట్ల ఆయనకుగల మక్కువను వివరిస్తాయి. కుందుర్తి వచన కవితా తత్వాన్ని వెల్లడిస్తాయి.

*పాతకాలం పద్యమైతే / వర్తమానం వచన గేయం*

*(నాలోని నాదాలు-10)*

అన్నది ఆయన నినాదం. వచన కవితను చేపట్టిన ఇతర కవులు దానిని ఒక ప్రయోగంగా మాత్రమే భావించిన సమయంలో కుందుర్తి దానిని ప్రజల అభ్యున్నతికి ఉపకరించే ప్రయోజనాత్మక కవితా ప్రక్రియగా గుర్తించాడు.

'నా ఊహలో వచన కవిత్వం అంటే ప్రజల కవిత్వం... ఒక్క మాటలో చెప్పాలంటే నా ఊహలో కవితకు శరీరం ప్రజల వ్యవహారిక భాష, ఆత్మ వారి అభ్యున్నతి' అని స్పష్టంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. మార్క్సిస్టు దృక్పథం ఆధునిక కవిత్వానికి ప్రధాన లక్షణం అంటారు కుందుర్తి. కావ్య రచనా విధానంలో మార్క్సిస్టు దృక్పథాన్ని ప్రవేశపెట్టి కవిత్వాన్ని సాధ్యమైనంత ఎక్కువగా ప్రజలవద్దకు తీసుకొని వెళ్లడం, ప్రజలలో భావవిప్లవం రావడానికి కృషిచేస్తూ, వారిని విప్లవోన్ముఖులుగా తయారు చేయడం కవుల బాధ్యతగా భావించారాయన.

సంస్కృత భాషా, కావ్యభాషా మర్యాదలు ఇంకా పాటించాలనుకోవడం, పీల్చి పిప్పి చేయబడి శవాకారాలుగా నిల్చి ఉన్న కవి సమయాలు, అలంకారాలను పట్టుకొని వేళ్లాడడం, పాండిత్య ప్రకర్షను ప్రదర్శించడమే గొప్ప కవిత్వంగా భావించే సంస్కృతిని వదులుకోలేకపోవడం ఆధునిక కవిత్వంలో మిగిలిపోయిన దుర్లక్షణాలు అంటారు. ప్రాచీన కవిత్వంలోని లోపాలను గుర్తుచేసి వచన కవితోద్యమ ఆవశ్యకతను వివరిస్తారు.

*యతి ప్రాసల ఇరకాటంలో పొల్లు మాటలు వాడినట్లు ......... / కథాగమన భంజకంగా చంద్ర వర్ణన చేసినట్లు ........ / శైలికీ, ఛందస్సుకూ లోబడి శాఖా చంక్రమణం చేసి భావాన్ని బలహీన పరచినపుడు / ........................ ముగింపు మాట గుర్తు లేదా? (నాలోని నాదాలు-16)*

కవిత్వ ప్రయోజనం, రసాస్వాదన, కావ్య హేతువుల విషయంలో లాక్షణికుల మార్గమే కుందుర్తిది కూడా.

ప్రజలను అభ్యుదయ మార్గం పట్టించడం కవిత్వ లక్ష్యం కావాలని పోరాడిన ఆయన దాని ప్రధాన ప్రయోజనం ఆనందమేనని అంగీకరించారు.

***ఆకలి కాని వనమూలిక అమ్మకానికి వచ్చింది / ఆనందానికి మారు పేరు / కవిత్వం దాని పేరు*** *(నాలోని నాదాలు-15)*

రసాస్వాదనకు సహృదయత అవసరాన్ని

నొక్కిచెప్పాడు కుందుర్తి. *హృదయ పాత్ర లేకుండా / కవితా తటాకంలో దిగి / మంచినీరు ముంచుకోలేక / మరలారు వట్టి చేతుల ఇంటికి* (నాలోని నాదాలు-8)

ప్రతిభగల కవి మాత్రమే గొప్ప కావ్యాన్ని నిర్మించగలడనే లాక్షణికుల అభిప్రాయమే కుందుర్తి మాటల్లోనూ ధ్వనిస్తుంది. *ప్రతిభ లేని కవి వాక్కులో / పిలిస్తే పలికే అనౌచిత్యంలా* (నాలోని నాదాలు-16)

కవి సమయాలను కాదన్నా, అలంకారాలు వద్దన్నా అవి నూతన రూపంలోనైనా చేరకపోతే కవిత్వం చిక్కదనాన్ని సంతరించుకోదన్న వాస్తవాన్ని ఆయన గ్రహించారు. అందుకే భావచిత్రాల రూపంలో అలంకారాలు చోటుచేసుకోవడాన్ని అంగీకరించారు.

*పుట్టని ఒక భవిష్యత్తులోకి / పుట్టెడు ఊహల చేతులు చాచి* (నాలోని నాదాలు-9)

*జీవితం మిన్నెక్కటానికి నిర్మించుకున్న నిచ్చెన భావాల పాలరాళ్లతో కట్టిన మేడ* (నాలోని నాదాలు-15)

*జర జరా పాములా పాకి వస్తోంది / జరా భార మిప్పుడు* (నాలోని నాదాలు-16)

స్వేచ్ఛా ప్రకటనమనే ప్రయోజనాన్ని సాధించడం కోసం సంప్రదాయ ఛందస్సులను వదిలివేసినప్పటికీ ఛందస్సు యొక్క effects మరో రూపంలో సాధించబడుతున్నాయన్నది ఆయన అభిప్రాయం. 'ఆధునిక వచన గేయాల్లోని విరుపూ, విసురూ, ధోరణి, పలుకుబడి అన్నీ ఇందుకే పుట్టినవి' అంటారు. 'వరుసగా భావ చిత్రాలు వర్షంలా కురిపించడం ఆధునిక వచన గేయానికి వద్దన్నా పోని లక్షణం. అదీ యిందుకోసం పుట్టిందే. ఆ భావ పరంపరలో ఒక స్వతంత్ర లయాన్వితమైన ఛందో లక్షణం దాక్కొని ఉంది.' అని వచన కవిత్వంలో భావచిత్రాలు ఎక్కువగా ఉండడానికిగల కారణాలను విశ్లేషించారు. 'ఆధునిక కవిత్వపు శైలి సామాన్య ప్రజల సంభాషణ స్థాయికి రావాలి.' అని కుందుర్తి ప్రతిపాదించినప్పటికీ సాధారణ సంభాషణకు భిన్నమైన లయ కవిత్వానికి జీవమన్న వాస్తవం ఆయన హృదయాంతరాళంలో నిక్షిప్తమై ఉంది. అందువల్ల అంత్యప్రాసలను వదులుకోలేకపోయారు.

*తొలగబోతే జోలికి వచ్చి / గుండెలో కాంక్షా జ్వాలలు గుచ్చి* (నాలోని నాదాలు-26)

*పూల రాసుల్ని కాలితో తోసేసి / కాలాన్ని బిరడా పెట్టి సీసాలో మూసేసి* (నాలోని నాదాలు-16)

*ఇలా నువ్వు ఆగిపోతే కాలం నడిచే దెట్లా?*
*చీకటి వెలుగు లేకుండా జీవితం గడిచేదెట్లా?* (నాలోని నాదాలు

ఆ విషయాన్ని ఆయన కూడా గుర్తించారు. వాస్తవ అంగీకరించారు. *అంతటి విప్లవం తెచ్చి / అంత్య ప్రాస లొంగానని / విహంగం వెక్కిరించింది* (నాలోని నాదాలు-2

ఇన్ని విధాలుగా ప్రాచీన కవిత్వం పునాదుల వచన కవిత్వం నిలబడిందని గ్రహించడంవల్లనే 'అ పాత మా పునాది / నన్నయ్య నుండి నాదాకా తెల కవిత అంతా నాది' అన్నారు కుందుర్తి. అదే సమయ తనకున్న ప్రాచీన కవితా సంస్కారం ప్రభావం త ప్రతిపాదిస్తున్న ప్రగతివాద కవిత మీద పడకు ఉండటానికి ఆయన శాయశక్తులా ప్రయత్నించారు.

సంప్రదాయ భిన్నంగా ఉందన్న కారణంగా వ కవితను విమర్శించేవారికి చురకలు వేశారాయన.

*ఉచితంగా భోంచేసి లేచి / పెరుగెయ్యలేదని పోట్లాడినట్లు పెండ్లినాటి అలక దబ్బు అందలేదని / కార్యం వా వేసుకున్నట్లు / గణాలు లేనివి గుణాలు కావని గర్జిస్తారు మీ* (నాలోని నాదాలు-

'క్రమత లేని కవిత యేదో రాస్తున్నావుటే నువ అన్న వాళ్లను చూసి ఆయన నవ్వుకున్నాడు. కవి సారళ్యంతో తెలుగు నుడికారపు సొంపులతో వ్యవహ భాషాశక్తి సంపదలతో వర్ధిల్లాలి అని కుంద కోరుకున్నాడు. ఆ దిశలో తొలి కృషి చేసిన గురజాడ ఆయనకు చాలా అభిమానం. *వానపాము తోక మీద నుం / సముద్రాన్ని వెక్కిరించినట్లు / మదపుటేనుగు నడక చూ మశకం పకపకా నవ్వినట్లు / సూర్యుడికొక ఉపగ్రహాన్ని సూ వదలి / విజ్ఞానశాస్త్ర గర్వంతో విర్రవీగినట్లు మనిషి! గుర కవి కాదన్నారు / విరజాజికి వాసన లేదన్నారు* (నాలోని నాదాల

అంటూ గురజాడను కవి కాదన్న వారి స్థాయి ఏవి చక్కని ఉపమానాలతో చూపాడు. కవిత్వం ద్వా సాధించవలసిందేమిటి? అనే దాని మీద కుందు స్పష్టమైన అవగాహన ఉంది. కవిత్వం సామాన్యుడి బా గాథల వెనుక దాగిన వాస్తవాలను వెలికితీయాలి. మం చెడు తెలియజెప్పాలి. చీకటికి లొంగని, వెలుగు చ వెర్రిగా పొంగని స్థితప్రజ్ఞతను అలవరచాలి. ప్ర హృదయంలో ప్రేమను వెలిగించాలి. అందవ భవిష్యత్తును దర్శింపజేయాలి. జ్ఞాన లోచనం విచ్చుకున చేయాలి. (నాలోని నాదాలు-10)

కుందుర్తి తన కవిత్వంలో కరుణ రసానికి ప్రాధాన్యత నిచ్చాడు. అసలు రచయిత సృష్టికర్త ఆశించిన రసం కూడా కరుణమే అన్నారాయన.

*నిరుపేదవాని ముఖమండలంలోని / నిలువెత్తు విషాద రేఖలు*
*కడిగి / ఆకాశపు నొసటి మీద ఆనంద తిలకం దిద్ది*
*భూమాత గుండెలలో భూరి కరుణ పొంగించమని*
*ప్రేరేపించింది నన్నొక్క దైవాంశ* - (నాలోని నాదాలు-24)
*జీవితం కనురెప్పల కొసల చిందే దుఃఖాశ్రుమాలలు*
*పాటల పేటికల్లో పెట్టి పావనం చేసుకుంటున్నాను జన్మ*
- (నాలోని నాదాలు-17)

వచన కవితకు తీవ్రమైన వ్యతిరేకత ఉన్న కాలంలో దానికి ప్రజామోదం కలిగించే బాధ్యతను కుందుర్తి స్వీకరించాడు. వచన కవిత ఎలా ఉంటే నిలబడగలదో ఆలోచించి అనేక ప్రతిపాదనలు చేశాడు. వాటిలో కథాకావ్య సిద్ధాంతం ఒకటి. కవిత్వంలో కథాంశం లేనప్పుడు అవి కేవలం ప్రబోధ గేయాలు, వర్ణనాత్మక రచనలుగా మిగిలిపోవడం, రసపోషణకు అవకాశం లేకపోవడం జరుగుతుందని ఆయన భావించాడు. సామాజిక అభ్యున్నతి సందేశంగాగల అభ్యుదయ కవిత్వానికి వస్త్వాశ్రయ మార్గమే సరైనదని ఆయన అభిప్రాయం. ఎంతటి సమగ్రమైన అవగాహనతో ఆయన వచన కవితోద్యమాన్ని నడిపారో వివిధ సందర్భాల్లో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాల్ని గమనించినపుడు తెలుస్తుంది.

'ప్రోస్-పొయిట్రీ అనే దానికి పొయిటిక్-ప్రోస్ అనే దానికి ఉన్న తేడా గమనించడం అవసరం' అంటారు కుందుర్తి. 'ఇది కవిత్వమా, వచనమా అని తెల్సుకోవడం కేవలం అచ్చువేసిన పద్ధతిపై మాత్రమే ఆధారపడి ఉండదు. కవిత్వంలోనూ, వచనంలోనూ వాక్య నిర్మాణ వైఖరులలో చాలా తేడాలు ఉంటాయి. 'వచ్చె నాతడు భీముని పగిది' అని వచనంలో రాసినవాడు ప్రారంభించడు. శక్తివంతంగానో, క్లుప్తంగానో, వ్యంగ్యంగానో మరొక విధంగానో చెప్పడానికి కవి వాక్య నిర్మాణంలో ఒకానొక వక్రతను ఆశ్రయిస్తాడు. వచన రచయితకు ఆ అవసరం ఉండదు. అందుకే ప్రతి పద్యానికీ, గేయానికీ ప్రోస్ ఆర్డర్ అనేది ఒకటి ఉంటున్నది. అయితే వచన కవితలో వ్యవహార భాష ప్రవేశించింది కాబట్టి ఈ వక్రత కొట్టవచ్చినట్లుగా కనిపించడం లేదు. అంతమాత్రాన దానిని వచనంగా భావించడం కుదరదు.' అని స్పష్టంగా కవితాత్మకంగా ఉండే వచనానికి, వచన కవిత్వానికి ఉండే తేడాను వివరించారు. వచన కవిత్వాన్ని రాసేవారు వచన గేయంలోని పంక్తి నిర్మాణ శిల్ప రహస్యాల్ని గమనించి ప్రత్యేక శైలిని ఏర్పరుచుకోవాలని, అలంకార శాస్త్ర గ్రంథాల అధ్యయనం కంటే కష్టతరమైన లేక కనీసం దానితో సమానమైన సాధన ఉంటేగాని వచన కవిత్వం రాణించదనే విషయాన్ని గ్రహించాలని అంటారు కుందుర్తి.

నాటకాలలోనూ వచన కవిత్వాన్ని ప్రవేశపెట్టిన ఖ్యాతి కుందుర్తిదే. 'ఆశ', 'శిక్ష ఏమిటి?', 'ఆచార్లగారమ్మాయి' అనే రెండు నాటకాలు, ఒక నాటిక వారు రచించారు. 'నాటకం కవిత్వాన్ని రంగరించుకుంటే దానిని కవిత్వ నాటకం (Poetic play) అంటాను. పైన పేర్కొన్న నాటకాలు, నాటిక ఆ కోవలోనివి' అన్నారు పోరంకి దక్షిణామూర్తి. కవి మీద, అతని రచనల మీదా, తన భావాలను వ్యక్తీకరించడానికి అతడు ఎంచుకునే ప్రక్రియల మీదా స్థల, కాలాల ప్రభావం ఉంటుందనేది జగమెరిగిన సత్యం. భావ సాంద్రతతో రాయగలిగిన శక్తి ఉండి కూడా (అందుకు 'నగరంలో వాన' మంచి ఉదాహరణ) ఉద్దేశ్యపూర్వకంగా దానిని పక్కన పెట్టి, పాశ్చాత్య ప్రభావాన్ని పక్కకు తోసి ఒక భిన్నమైన శైలిని కుందుర్తి ఏర్పరచుకున్నారు. అందుకు ఆయనలోని ప్రయోగశీల దృక్పథం, సమకాలీన సామాజిక సమస్యల అవగాహన దోహదకారులయ్యాయి. తాను నమ్మిన అభ్యుదయ భావాలను ప్రజలకు చేర్చడానికి వచన కవిత్వమే తగిన వాహిక అని నమ్మి, వచన కవిత్వం కేవలం ఒక ప్రయోగంగా మిగిలిపోకుండా, ఒక ప్రక్రియగా నిలబడడానికి ఆమరణాంతం కృషి చేశారు.

*నీతికి నిలిచిన వాణ్ణి / కొత్త రీతిలో రసవాదం కొలిచిన వాణ్ణి*
(గుర్తుంచుకో)

'ఆధునిక భావధార మత్తగజంవంటిది. దానిని లాక్షణిక ఛందస్సుల డెమ్మీ ఆక్టోవ్ పేకెట్‌లో బంధించడం ఎవరికీ సాధ్యం కాదు. ఒక్క పుటలో ముద్రితమైన VERSEలో UNI VERSEను ప్రతిబింబించడం ఆధునిక కవితకు ప్రాణ లక్షణం! ఆ లక్షణాన్ని రసస్ఫూర్తితో రక్షించిన కొద్దిమంది కవులలో శ్రీ కుందుర్తి నిస్సందేహంగా ప్రథమ గణ్యుడు.' అన్న సోమసుందర్‌గారి మాటలు అక్షరసత్యాలు.

డా. నల్లపనేని విజయలక్ష్మి,
గుంటూరు. ఫోన్: 970 166 7350.